సాక్షి


అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం ׀ 6 ׀ ఫిబ్రవరి ׀ 2023



కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

అరకులో 8.8 డిగ్రీలు, చింతపల్లి, పాడేరు మండలం మినుములూరులో 10 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 8లో



అధ్వాన రోడ్డు.. అద్దంలా..

జిరిమిశాల -బంగారుమెట్ట గ్రామాల రోడ్డు అభివృద్ధితో పది గ్రామాల గిరిజనులకు రవాణా కష్టాలు తప్పాయి. 8లో



అంగన్‌వాడీల్లో స్మార్ట్ సేవలు

మాతా–శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు విశేష సేవలందిస్తున్నాయి. ప్రభుత్వ ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. 8లో

న్యూస్‌రీల్

పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు

ఏడు బోట్లలో 452 మంది సందర్శకులు



పోచవరం బోట్ పాయింట్ వద్ద పర్యాటకులు

వీఆర్‌పురం: మండలంలో 452 మంది పర్యాటకులు 7 బోట్లలో పాపికొండల వీక్షణకు వెళ్లారని ఏపీ టూరిజం మేనేజర్ సీహెచ్ పవన్ ఆదివారం తెలిపారు. గత రెండు రోజుల నుంచి పర్యాటకుల సంఖ్య పెరిగిందని ఆయన వివరించారు. పర్యాటకుల రాకతో పోచవరం బోట్ పాయింట్, పేరంటపల్లి శివాలయం, కొల్లూరు హట్స్ ప్రాంతాలన్నీ కళకళలాడుతూ దర్శనమిచ్చాయి.

నిర్వాసిత ఆదివాసీలకు న్యాయం చేయాలి



ఆదివాసీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బృంద సభ్యులు

ఎటపాక: పోలవరం ఆదివాసీ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ భూపోరాటానికి దిసోమ్ బృందం మద్దతు పలికింది. జాతీయ స్థాయి నాయకత్వ నైపుణ్య నిర్మాణ సంస్థ దిసోమ్ పోలవరం ముంపు మండలాల ఆదివాసీల స్థితిగతుల పరిశీలనకు ఆదివారం మండల కేంద్రానికి విచ్చేసింది. ఈ సందర్భంగా కన్నాయిగూడెంలోని నిర్వాసితుల పునరావాస కాలనీని సందర్శించింది. అక్కడ ఆదివాసీలు 94 రోజులుగా చేపడుతున్న దీక్ష శిబిరానికి చేరుకుని మద్దతు పలికింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బృందం సభ్యులు ఈ ప్రాంత సమస్యలను ఆదివాసీలను అడిగి తెలుసుకున్నారు.

పెద్దపులి దాడిలో పశువు మృతి



పెద్దపులి దాడిలో మృతి చెందిన పశువు

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ పసిని, మర్రివలస గ్రామాల సమీపంలోని సరిహద్దు గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తుండటంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. రొంపల్లి పంచాయతీని ఆనుకొని ఉన్న సరిహద్దు గ్రామాలైన విజయనగరం జిల్లా గంట్యాడ మండలం డీకేపర్తి పంచాయతీ రాపాలెం గ్రామానికి చెందిన పైకరీ నాగరాజుకు చెందిన పశువుపై శనివారం సాయంత్రం పెద్దపులి దాడి చేయడంతో మృత్యువాతపడింది. అదే ప్రాంతంలో ఉన్న పాదముద్రలు పెద్దపులికి చెందినవిగా ఉండటంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. గత నెలరోజులుగా రొంపల్లి పంచాయతీలోని చినకోనేల, తదితర గ్రామాల్లో సంచరిస్తున్న పులి దాడి చేయడంతో ఐదు పశువుల వరకు మృత్యువాతపడ్డాయి. అటవీశాఖ అధికారులు స్పందించి పులి నుంచి రక్షణ కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

బాక్సింగ్‌లో గిరి విద్యార్థిని ప్రతిభ

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కీర్తి ప్రసన్న



సాధించిన పతకాలతో కీర్తి ప్రసన్న

కొయ్యూరు: మారుమూల గ్రామానికి చెందిన బాలిక ఆటల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తోంది. యూ.చీడిపాలెం సర్పంచ్ దడాల రమేష్ కుమార్తె కీర్తి ప్రసన్న గత నెలలో రాజమహేంద్రవరంలో జరిగిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో బాక్సింగ్‌కు సంబంధించి 63–66 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించింది. ఆమె బాక్సింగ్‌లో ప్రతిభ కనబరచడంపై ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు ఆదివారం అభినందనలు తెలిపారు. వై రామవరం ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ చదువుతున్న కీర్తి గతేడాది డిసెంబర్‌లో విజయవాడలో జరిగిన పోటీల్లో వెండి పతకం సాధించింది. ఆమె తండ్రి రమేష్ మాట్లాడుతూ తిరుపతిలో జరిగే జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కార్గో రవాణాపై నిఘా!

- అడ్డగోలు సరకు రవాణాకు అడ్డుకట్ట
- ఇటీవల రేషన్ బియ్యంతో పట్టుబడ్డ డీజీటీ
- అప్రమత్తమైన ఆర్టీసీ అధికారులు
- బుకింగ్ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, సిబ్బందికి హెచ్చరిక



ఆర్టీసీ లాజిస్టిక్స్ కంటైనర్

సాక్షి, విశాఖపట్నం: కార్గో రవాణాలో అక్రమాలకు ఆస్కారం లేకుండా ఆర్టీసీ పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో ఆర్టీసీ కార్గో బస్సులో రేషన్ బియ్యం రవాణా చేస్తూ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇకపై అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి నిఘా పెట్టనుంది. అంతగా తనిఖీల బెడద ఉండదన్న ఉద్దేశంతో అక్రమార్కులు ఆర్టీసీ కార్గో బస్సుల్లో నిషేధిత, అక్రమ సరకు రవాణాను ఎంచుకుంటున్నారు. కాంట్రాక్టర్లు, ఏటీబీ (ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్) ఏజెంట్లకు కూడా సరకు రవాణా బుకింగ్ సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది. దీనిని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు. ఒక సరకు పేరు చెప్పి మరొక సరుకును రవాణా చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో పట్టుబడిన డీజీటీ వాహనంలో నూకలు పేరు చెప్పి రేషన్ బియ్యాన్ని రవాణా చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత డీజీటీ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్, కంట్రాక్టరు ఉన్నట్టు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కార్గోలో సిమెంట్, హార్డ్‌వేర్, గృహావసర సరకులు, గోధుమ పిండి, దుస్తులు, మందులు, నూకలు వంటివి రవాణా జరుగుతోంది.

కొందరు అడ్డదారులు తొక్కడంతో..

ఇప్పటికే ఆర్టీసీ కార్గో సేవలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఫలితంగా ఆదాయం బాగానే సమకూరుతోంది. దీంతో ఈ కార్గో వ్యవస్థను మరింత విస్తతం చేయాలన్న యోచనలో ఉంది. ఇలాంటి తరుణంలో సరకు రవాణాలో కొందరు అడ్డదారులు తొక్కడం ఆర్టీసీ ఉన్నతాధికారులను కలవరానికి గురి చేస్తోంది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే ఈ కార్గో వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భావిస్తోంది. అందుకే ఆర్టీసీ లాజిస్టిక్స్ కంటైనర్లు/డీజీటీ (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు)ల్లో సరకు బుకింగ్, రవాణాలపై గట్టి నిఘా పెట్టాలన్న నిర్ణయానికొచ్చింది. వీటిలో రేషన్ బియ్యం, తలవెంట్రుకలు, చేపలు, మద్యం తదితర వాటితో పాటు నిషేధిత సరకులు/వస్తువులను అనుమతించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. దీనిపై సంబంధిత ఏటీబీ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, ఆర్టీసీ సిబ్బందికి ముందుగా సమావేశాల ద్వారా అవగాహన కల్పించడం, హెచ్చరికలు జారీ చేయడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి అక్రమ రవాణాలో భాగస్వామ్యం ఉన్న వారిని ఉద్యోగాల నుంచి తొలగింపు వంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటామని, బాధ్యులైన ఏటీబీ ఏజెంట్లు, కాంట్రాక్టర్ల ఏజెన్సీలను రద్దు చేయడమే కాకుండా వారిపై కేసులు నమోదు చేస్తామని ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవి కుమార్ 'సాక్షి'తో చెప్పారు.

మధురవాడ-హైదరాబాద్ బస్సు రద్దు

మరోవైపు గంజాయి అక్రమ రవాణా బెడద **కూడా ఆర్టీసీకి ఉంది.** మధురవాడ నుంచి **భద్రాచలం మీదుగా** హైదరాబాద్ వెళ్లే **బస్సులో గంజాయి** రవాణా చేస్తున్నట్టు **వెలుగు చూసింది.** నర్సీపట్నం, చింతపల్లి, **సీలేరు, చింతూరు,** వీఆర్‌పురం, నేరెళ్ల, ఎటపాక, **భద్రాచలం ఏజెన్సీ** ప్రాంతాల మీదుగా **ఈ బస్సు ప్రయాణిస్తుంది.** అక్రమార్కులు ఈ **బస్సును గంజాయి** రవాణాకు అనువుగా **మలుచుకున్నారు.** వలుమార్లు దీనికి అడ్డుకట్ట **వేయడానికి ప్రయత్నించినా** వీలు కాలేదు. దీంతో **ఆర్టీసీ అధికారులు** ఇటీవల ఆ బస్సు సర్వీసును **రద్దు చేశారు.**

వైకుంఠపురంలో పోలీసు బలగాల సోదాలు



వైకుంఠపురం సమీప అడవుల్లో సారా ఊటను ధ్వంసం చేసిన పోలీసులు



ఏరియా డామినేషన్ ఆపరేషన్ కూంబింగ్‌లో రాజవొమ్మంగి పోలీసు బలగాలు

రాజవొమ్మంగి: వైకుంఠపురం గ్రామ పరిసరాల్లో ఆదివారం స్పెషల్, సివిల్ పోలీసులు జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో ఏరియా డామినేషన్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. శిథిల భవనాలు, కల్వర్టులు, శ్మశానవాటికలు వంటి ప్రాంతాలను ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు ఎంచుకొన్నారా? అని ఆరాతీశారు. జన జీవనానికి దూరంగా వున్న ప్రాంతాలను తనిఖీ చేశారు.

1600 లీటర్ల ఊట ధ్వంసం: వైకుంఠపురం అడవుల్లో కొండ కాలువ పక్కన నాటు సారా తయారీ కోసం భద్రపరచిన 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. సారా బట్టి సరంజామా ప్లాస్టిక్ పీపాలు, వంట పాత్రలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ సంఘటనలో ఎవరూ పట్టుబడలేదు. పీసీలు ప్రసాద్‌రెడ్డి, దురారావు, సాయుధ ఏపీఎస్పీ బలగాలు పాల్గొన్నాయి.

గిరిజనులతో బలపడిన పోలీసుల మైత్రి

సీఆర్పీఎఫ్ డీఎస్పీ చరణ్‌రాజ్



వెల్లపాలెంలో గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న సీఆర్పీఎఫ్ డీఎస్పీ చరణ్ రాజ్

పెదబయలు: గిరిజనులతో పోలీసు మైత్రి బలపడిందని సీఆర్పీఎఫ్ డీఎస్పీ పి. చరణ్ రాజ్ తెలిపారు. సీఆర్పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే ఆదేశాల మేరకు ఆదివారం సీకరి పంచాయతీ బొడ్డాపుట్టు, వెల్లపాలెం గ్రామాల్లో సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో 125 మంది పేద గిరిజనులకు, వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఏటా సీఆర్పీఎఫ్ సామాజిక సేవల్లో భాగంగా గిరిజనులు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో మారుమూల గ్రామాల్లోకి వెళ్లినప్పుడు పోలీసులకు దూరంగా ఉండేవారని, తమ సేవలకు గుర్తించి వారి సమస్యలు పరిష్కరించడంతో గిరిజనుల్లో మార్పు వచ్చిందన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చి సేవలు పొందుతున్నారన్నారు. మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. దీంట్లో భాగంగా ఇంజరి, జామిగుడ, గిన్నెలకోట, కుంతుర్ల పంచాయతీలకు తారురోడ్ల నిర్మిస్తున్నామని, ప్రపంచంతో పోటీ పడేలా సాంకేతిక సేవలు సెల్ టవర్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నిరుద్యోగ గిరిజన యువత కోసం ప్రభుత్వం అనేక ఉద్యోగాల కోసం శిక్షణ ఇస్తుందని సూచించారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా, వారి కుటుంబాలకు, గ్రామానికి మండలానికి ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టాలన్నారు. స్థానిక ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు, ఎంపీటీసీ వంతాల ఆనందరావు, నాయకులు కొర్ర కనకరాజు మహిళలు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

ముస్లిం రాజకీయ చైతన్య వేదిక డిమాండ్



మాట్లాడుతున్న నసిరుద్దీన్

డాబాగార్డెన్స్(విశాఖ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముస్లింలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని ముస్లిం రాజకీయ చైతన్య వేదిక డిమాండ్ చేసింది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వేదిక రాష్ట్ర కన్వీనర్ నసిరుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. కోస్తాంధ్రలో 25 ఏళ్లుగా ఒక్క ముస్లిం ప్రజాప్రతినిధి కూడా లేడని.. 30 ఏళ్ల కిందట కాకినాడ నుంచి కాంగ్రెస్ ఓ ముస్లిం లాయర్‌కి సీటు ఇచ్చిందని గుర్తు చేశారు. అప్పట్లో ఆయన రెండవ స్థానంలో నిలిచారన్నారు. 28 ఏళ్ల కిందట వైజాగ్‌లో ముస్లిం ఎమ్మెల్యేను గెలిపించారన్నారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో మినహా శాసనసభ, పార్లమెంట్‌కు అవకాశం లేకుండా అన్ని పార్టీలు విస్మరించాయన్నారు. అన్ని పార్టీలు ముస్లిం నాయకత్వాన్ని చట్ట సభలకు దూరం చేస్తున్నాయని విమర్శించారు. ఏ పార్టీ అయితే రాష్ట్రంలో ఎక్కువ శాతం ముస్లింలకు ప్రాధాన్యం కల్పిస్తుందో.. ఆ పార్టీని గెలిపించుకునేందుకు ముస్లిం రాజకీయ చైతన్య వేదిక కృషి చేస్తుందన్నారు. సమావేశంలో షేక్ సలీం, ఎండీ హనీఫ్, ఇమ్రాన్ హుస్సేన్, జహంగీర్, షరీఫ్, వల్లీ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ స్టేట్ చాంపియన్‌గా ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ బ్యాడ్మింటన్‌లో స్టేట్ చాంపియన్‌గా నిలిచారు. బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ కడప ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు ఇండోర్ స్టేడియంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు ఏపీ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. 45 ప్లస్ కేటగిరీలో సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఉషశ్రీ రెండు టైటిల్స్ గెలుపొందారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథ్ చేతుల మీదుగా ట్రోఫీలు అందుకున్నారు. రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌ను గెలుచుకున్న ఉషశ్రీ మార్చి 19 నుంచి గోవాలో జరగనున్న నేషనల్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహిస్తారు. నేషనల్స్‌లో గెలుపొంది ఇంటర్నేషనల్ టైటిల్ సాధించడమే తన లక్ష్యమని ఆమె తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

శబరినదిలో పడి యువతి మృతి



ప్రత్యూష మృతదేహం

చింతూరు: దుస్తులు ఉతికేందుకు శబరినదికి వెళ్లిన మండలంలోని నిమ్మలగూడెంకు చెందిన సవలం ప్రత్యూష(30) అనే యువతి ప్రమాదవశాత్తూ నదిలో పడి మృతిచెందింది. శనివారం సాయంత్రం దుస్తులు ఉతికేందుకు శబరి నది వద్దకు వెళ్లిన ఆమె ప్రమాదానికి గురైంది. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నది వద్దకు వెళ్లి చూడగా గట్టుమీద దుస్తులు, చెప్పులు కనిపించాయి. దీంతో ఆమె ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినా జాడ తెలియలేదు. కాగా ఆదివారం మధ్యాహ్నం శబరినది వంతెన సమీపంలో ఆమె మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

7 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డ గ్రామంలో ఈ నెల 7వ తేదీ నుంచి డివిజన్‌స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు జానకి, రాంబాబు, సాదులు తెలిపారు. ఈనెల 12న జరగనున్న సీతమ్మ పర్వతం(జెండాకొండా)పై కొలువైన సీతమ్మ తల్లి మహోత్సవాల సందర్భంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. ఈ నెల7వ తేదీన జరగబోయే ఈ టోర్నమెంట్‌లో పాల్గొనదలిచే జట్లు ఆరవ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు సూచించారు. మొదటి, ద్వితీయ,తృతీయ బహుమతులకు రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేయనున్నట్టు వారు తెలిపారు. ఎంట్రీ ఫీజు కేవలం రూ.300 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9398442479, 9381359434లో సంప్రదించాలని వారు కోరారు.

గంజాయికి అడ్డుకట్ట అభినందనీయం



మీకోసం-మీ పోలీసు ర్యాలీలో పాల్గొన్న సినీ హీరో శ్రీకాంత్, వర్ధమాన హీరో, హీరోయిన్లు రాహుల్, శ్రీవాణి, పోలీసులు గిరిజనులు

- పోలీసుల సేవలు సద్వినియోగం చేసుకోండి
- ప్రముఖ సినీ హీరో శ్రీకాంత్

అరకులోయ: గంజాయిసాగుకు అడ్డుకట్ట వేయడంలో పోలీసుల కృషి అభినందనీయమని ప్రముఖ సినీ హీరో శ్రీకాంత్ పేర్కొన్నారు. సినిమా షూటింగ్ నిమిత్తం ఆదివారం ఆయనతోపాటు వర్ధమాన హీరో రాహుల్, జీవిత–రాజశేఖర్ కుమార్తె శ్రీవాణి అరకులోయ విచ్చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అరకు సీఐ దేముడుబాబు అరకులోయ మండలం గంగుడి గ్రామంలో ఆదివారం నిర్వహించిన మీకోసం–మీ పోలీసు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మూఢ నమ్మకాలు నమ్మొద్దు...గంజాయి పండిచొద్దని అంటూ హీరో శ్రీకాంత్ నినాదాలు చేస్తూ గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు అరకులోయ ప్రాంతంలో అధికమని ప్రచారం ఉందన్నారు. అయితే ఎక్కడా గంజాయి సాగు లేకుండా ఈ మూడేళ్లలో పోలీసుశాఖ గిరిజనుల్లో చైతన్యం తీసుకురావడం దేశానికి మంచిదని పేర్కొన్నారు. గంజాయి సాగుకు పూర్తిగా దూరంగా ఉండాలని గిరిజనులను కోరారు. పోలీసులు చేపడుతున్న అన్ని కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూఢ నమ్మకాలతో చెడువులు, చిల్లంగుల జోలికి పోవొద్దన్నారు. ఇంత మంచి చేస్తున్న పోలీసుల మాట వినాలని, అరకు సీఐ దేముడుబాబు సేవలు ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. వర్ధమాన హీరో రాహుల్ మాట్లాడుతూ చేతబడులతో పాటు గంజాయి మహమ్మారి సమాజానికి ప్రమాదకరమన్నారు. గంజాయి తాగితే రాక్షసుల్లా మారే పరిస్థితులు ఉంటాయని, సమాజానికి హాని జరిగే ప్రమాదం ఉందన్నారు. హీరోయిన్ శ్రీవాణి మాట్లాడుతూ తాను వైద్యవిద్య చదివానని, ప్రాణం చాలా విలువైనది అన్నారు. గంజాయితో పాటు మూఢ నమ్మకాలతో చేతబడులు జోలికి పోయి, కొట్లాటలతో ప్రాణాలను తీసుకోవద్దని హితవు పలికారు. గంజాయి ఆరోగ్యానికి చాలా హానికరమని, సమాజాన్ని నష్టం చేసే కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. పోలీసులు చేపడుతున్న అవగాహన, చైతన్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఆర్టీల నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

రంపచోడవరం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల కమిటీ ఎన్నికలు స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం జరిగాయి. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైట్ల లచ్చిరెడ్డి, ఎలక్షన్ కమిటీ కాక లక్ష్మణ్, ముర్ల చిన్నారావు పర్యవేక్షణలో జిల్లా యూనియన్‌కు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా సారపు కృష్ణమూర్తిదొర, ఉపాధ్యక్షుడిగా కొలాటి ఎలీషాబాబు, ప్రధాన కార్యదర్శిగా గాదె సత్యనారాయణరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఉయిక సత్తిపండు, మహిళా అధ్యక్షురాలిగా మయూరి రజిత, ఉపాధ్యక్షురాలిగా విరేటి హైమాగంగారత్నం, కోశాధికారిగా కారం బాబూరజదీప్ దొరను ఎన్నుకున్నారు. కొత్త కమిటీని 23 మందితో ఏర్పాటు చేశారు. నూతన కమిటీ ద్వారా ఏపీటీడబ్ల్యూ సీఆర్టీయూ యూనియన్ ద్వారా 12 నెలల జీతం విడుదల,ఉద్యోగ భద్రత వచ్చేవిధంగా ఆశిస్తున్నామన్నారు.

సీఆర్టీల జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



కృష్ణమూర్తి దొర

గంగవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడిగా గంగవరం గ్రామానికి చెందిన శారపు కృష్ణమూర్తి దొర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కృష్ణమూర్తి ఎన్నికపై సర్పంచ్ కలుముల అక్కమ్మ, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, ఉప సర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వెలుగులో మరో చీకటి వ్యవహారం!

- పూర్తికాని విచారణ
- సస్పెండైన వారికి ఉద్యోగాలిచ్చేందుకు యత్నం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతు సంఘాలు



వెలుగు కార్యాలయం

రంపచోడవరం: రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుంచి ఇష్టారాజ్యంగా నగదు డ్రా చేసి ఏడాది గడుస్తున్నా వాటి లెక్కలు ఇంతవరకు తేలలేదు. అప్పుడు 'సాక్షి' కథనంతో వెలుగు ఉన్నతాధికారి ఏపీడీతో సహా ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారం జరిగి ఏడాది గడుస్తోంది. రైతు సంఘాల నుంచి ఎన్ని నిధులు డ్రా చేశారు, ఎంత ఖర్చు చేశారు, ఎంత స్వాహా చేశారనే దానిపై నేటికీ విచారణ పూర్తి కాలేదు. అయితే పెండింగ్ విచారణ పేరుతో సస్పెండ్ అయిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెర్ప్ అభ్యంతరాలతో తిరిగి విచారణ

వెలుగు ద్వారా చేపట్టిన జీడిమామిడి పిక్కలు, పసుపు కొమ్ములు, కొండచీపుళ్ల కొనుగోలులో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రమేయం లేకుండా వెలుగు ఏపీఎం, సీసీలు సంఘాల ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేశారని అప్పటి కలెక్టర్ హరికిరణ్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన విచారణకు ఆదేశించారు.

తిరిగి విచారణకు..

ప్రాథమిక విచారణలో వెలుగు ఏపీడీ, ముగ్గురు సీసీలు, ఒక ఏపీఎంను సస్పెండ్ చేశారు.అనంతరం నిజనిర్ధారణ కోసం వై.రామవరం ఎంపీడీవో, అప్పటి ఏపీవో జనరల్, మొబైల్ కోర్టు ఎస్‌డీసీలు విచారణ జరిపి, నివేదికను అప్పటి పీవోకు అందజేశారు. విచారణ నివేదికను సెర్ప్‌కు పంపించారు. దీనిపై సంతృప్తి చెందని సెర్ప్ అధికారులు తిరిగి విచారణకు ఆదేశించారు.

పెండింగ్ విచారణ పేరిట..

పెండింగ్ విచారణ పేరుతో ముగ్గురు సీసీలు, ఒక ఏపీఎంను తిరిగి విధుల్లో తీసుకునేందుకు మంతనాలు జరుగుతున్నాయి. రూ.1.88 కోట్లు రైతుల సంఘాల నుంచి డ్రా చేసి వాటికి లెక్కాపత్రం లేకుండా స్వాహా చేసిన వారికి తిరిగి ఉద్యోగాలు ఇచ్చే ప్రయత్నంపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భారీ ఎత్తున నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా తిరిగి విధుల్లో తీసుకునేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పుడు జరిగిన విచారణలో సీసీలు, ఏపీఎంలు డ్రా చేసిన నిధులు అప్పటి వెలుగు ఏపీడీకి ఇచ్చినట్లు చెప్పారు. ఈ వ్యవహారంలో సస్పెండ్ అయిన అప్పటి ఏపీడీ శ్రీనివాసరావు కూడా విచారణను ఎదుర్కొంటున్నారు.

విచారణ పూర్తి కాలేదు

రైతు సంఘాల నుంచి డబ్బులు డ్రా చేసిన వ్యవహారంలో విచారణ పూర్తి కాలేదు. ప్రస్తుతం ఫైల్ ఐటీడీఏ పీవో వద్ద ఉంది. పీవో నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.అప్పటి ఏపీడీపై కాకినాడ డీఆర్‌డీఏ విచారణ చేస్తున్నారు. పెండింగ్ విచారణతో విధుల్లో తీసుకోవాలని ఆదేశాలు వస్తే వారిని విధుల్లో తీసుకోవడం జరుగుతుంది.

–శ్రీనివాసరావు, ఏపీడీ వెలుగు, రంపచోడవరం

నివేదిక అందజేస్తాం

రంపచోడవరం వెలుగు ఉద్యోగులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సంబంధించి నిధుల డ్రా చేసిన వ్యవహారంలో విచారణ పూర్తి చేస్తున్నాం. నాలుగైదు రోజుల్లో విచారణ నివేదికను సెర్ప్‌కు అందజేస్తాం. ఈ వ్యవహారంలో అప్పటి ఏపీడీ, డీపీఎం, ఏపీఎంలకు సంబంధించి మాత్రమే విచారణ నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

– రమణి, డీఆర్‌డీఏ పీడీ, కాకినాడ

క్లుప్తంగా

కాఫీ వెట్ మిల్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన



ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు ఉమామహేశ్వరరావు

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ ఎం. నిట్టాపుట్టు గ్రామంలో కోవెల ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కాఫీ వెట్ మిల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. అక్కడ గిరిజన రైతు సేవా ఉత్పత్తి సంస్థ సమక్షంలో నిర్మించిన యూనిట్ గురించి అడిగి తెలుసుకున్నారు. సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

54 కేజీల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి

పాయకరావుపేట: నామవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై 54 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. విశాఖపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనంలో ఇద్దరు వ్యక్తులు 54 కేజీల గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డారన్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మజార్ పాష, తమిళనాడు రాష్ట్రానికి చెందిన అరవిందస్వామి గంజాయి తరలిస్తుండగా అదుపులోనికి తీసుకుని, కేసు నమోదు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు.

అధ్వాన రోడ్డు.. అద్దంలా!



జాంకారమ్మ గుడి ఘాట్‌లో అధ్వాన రోడ్డు (నాడు)




జాంకారమ్మ గుడి ఘాట్‌లో సీసీరోడ్డు అభివృద్ధి (నేడు)

- బిరిమిశాల -బంగారుమెట్ట గిరిజనులు సంతోషం
- అసంపూర్తిగా వదిలేసిన గత టీడీపీ పాలకులు
- రూ.285 లక్షలతో అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


సాక్షి,పాడేరు: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక కృషితో బిరిమిశాల -బంగారుమెట్ట గ్రామాల రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకుంది. పది గ్రామాల గిరిజనులకు రవాణా కష్టాలు తొలగాయి. పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ కందమామిడి జంక్షన్ నుంచి మారుమూల బంగారుమెట్ట గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు గత టీడీపీ హయాం నుంచే అధ్వానంగా మారింది. ఈ రోడ్డు అభివృద్ధి చేయాలని 2014 నుంచి గిరిజనులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేదు. కందమామిడి జంక్షన్ నుంచి తామరాపల్లి వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డునే అప్పట్లో అభివృద్ధి చేసి మిగిలిన మూడు కిలోమీటర్ల అధ్వాన రోడ్డు, కూలే దశలో కల్వర్టుల దుస్థితిని అప్పటి పాలకులు వదిలేశారు. దాంతో బైక్‌లు నడిపేందుకు ఈ ప్రాంత గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

10 గ్రామాల గిరిజనులకు తొలగిన కష్టాలు..

2019 ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బంగారుమెట్ట రోడ్డు దుస్థితిపై పాడేరు ఎమ్మెల్యే స్పందించారు. రోడ్డు అభివృద్ధికి సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారుల నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక మరమ్మతుల కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.285 లక్షలను మంజూరు చేసింది. ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈ బాలసుందరబాబు, ఇతర ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో రోడ్డు అభివృద్ధి పనులు ఇటీవల పూర్తయ్యాయి. తామరపల్లి నుంచి బంగారుమెట్ట వరకు అందమైన రోడ్డును నిర్మించారు. ప్రమాదకరంగా మారిన జాంకారమ్మ గుడి ఘాట్ ప్రాంతంలో సీసీ రోడ్డును వెడల్పుగా నిర్మించారు. బిరిమిశాల సమీపంలో సగం కూలిన కల్వర్టును పూర్తిగా నేలమట్టం చేసి, విశాలమైన బ్రిడ్జిని నిర్మించారు. పలుచోట్ల పాత కల్వర్టుల స్థానంలో కొత్తగా పైపు కల్వర్టులను నిర్మించారు. ఘాట్‌తోపాటు పలుచోట్ల రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడను నిర్మించారు. బంగారుమెట్ట రోడ్డు అభివృద్ధితో వనుగుపల్లి పంచాయతీలోని పది గ్రామాల గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఆ రోడ్డులో ప్రయాణం సాఫీ అయ్యింది.రోడ్డు అభివృద్ధికి కృషి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిలకు గిరిజనులు కృతజ్ఞతలు చెబుతున్నారు.



సగం కూలిపోయిన బిరిమిశాల సమీపంలోని బ్రిడ్జి (నాడు)



కొత్తగా నిర్మించిన బిరిమిశాల సమీపంలోని బ్రిడ్జి (నేడు)

బంగారుమెట్ట రోడ్డును నాణ్యతగా నిర్మించాం



తామరాపల్లి నుంచి బిరిమిశాల మీదుగా బంగారుమెట్ట రోడ్డును నాణ్యతగా నిర్మించాం. బ్రిడ్జితో పాటు కల్వర్టుల నిర్మాణాలన్నింటిని నిరంతరం పర్యవేక్షించాం. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును అభివృద్ధి చేయడంతో గిరిజనులకు రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

– బాలసుందర బాబు, ఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, పాడేరు

సీఎం, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు



అధ్వాన రోడ్డుతో అనేక ఇబ్బందులు పడేవాళ్లం. గతంలో తామరాపల్లి వరకే రోడ్డు అభివృద్ధి చేయడంతో మిగిలిన రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇక్కట్లు ఉండేవి. ఈ రోడ్డు అభివృద్ధి, పలుచోట్ల గెడ్డలపై బ్రిడ్జి, కల్వర్టుల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆర్‌అండ్‌బీ అధికారులకు కృతజ్ఞతలు.

–దోకుల సుబ్బారావు, బిరిమిశాల గ్రామం, పాడేరు మండలం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కేజీబీవీ ప్రాంగణంలో చెత్త తొలగిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు

ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, దీనికోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ఆదివారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి స్థానిక కేజీబీవీ ప్రాంగణంతోపాటు మండల కేంద్రంలో చెత్తా చెదారాలు తొలగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు మన ఇళ్లు చుట్టు ప్రదేశాల్లో చెత్తాచెదారాలు లేకుండా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లు, తదితర వస్తువులు పడేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డస్ట్ బీన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, నాయకులు భూషణ్, సూరిబాబు, కోటిబాబు, నాగేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



మృతి చెందిన రావాడ ఎర్రేసు



మృతిచెందిన వమ్మవరం చినసూకులు (ఫైల్)

ఎస్.రాయవరం: గుర్రాజుపేట రోడ్డు సమీపంలో రేవుపోలవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై టీవీఎస్ మోపెడ్‌పై ఆగి ఉన్నవారిని, పల్సర్ బైకు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. కోటఉరట్ల మండలం పాత తంగేడు గ్రామానికి చెందిన పెదపూడి కళ్యాణం, రావాడ ఎర్రేసు అలియాస్ చంటిలు మోపెడ్ బండిపై రేవుపోలవరం జాతరకు వస్తూ మార్గమధ్యంలో గుర్రాజుపేట రోడ్డు సమీపంలో ఆగారు. వారి వెంట వస్తున్న వమ్మవరం గ్రామానికి చెందిన కుందూరు చినసూకులు, కూరపాటి శ్రీను పల్సర్ బైకుపై వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పాత తంగేడు గ్రామానికి చెందిన రావాడ ఎర్రేసు (41) అక్కడికక్కడే మృతి చెందగా, వమ్మవరం గ్రామానికి చెందిన యువకుడు కుందూరు చిన సూకులు(20) అనకాపల్లి ఆస్పత్రిలో మృతిచెందినట్టు చెప్పారు. ఈ ప్రమాదంలో వమ్మవరం బైకుపై ఉన్న కూరపాటి శ్రీను, పాత తంగేడు గ్రామానికి చెందిన పెదపూడి కళ్యాణం స్వల్ప గాయాలతో చికిత్స తీసుకుని ఇంటికి వెళ్లారు. వివరాల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సీఐ పార్టీ ఇస్తున్నారు.. 5 కోళ్లు కొట్టు!

- ఇన్‌స్పెక్టర్ పేరుతో కానిస్టేబుళ్ల దందా
- ఆ స్టేషన్ పరిధిలో వ్యాపారులను దోచుకుతింటున్న ఖాకీలు
- చికెన్ నుంచి రైస్‌బ్యాగ్‌లు, మసాలాల దోపిడీ
- సీఐ వ్యవహార శైలీ వివాదాస్పదమే..
- బయటకు చెప్పలేక ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): అయ్యగారు పార్టీ ఇస్తున్నారు. 5 కిలోల చికెన్ కొట్టి ఇవ్వు.! ఓయ్.. ఇన్‌స్పెక్టర్ గారి ఇంట్లో ఫంక్షన్.. నువ్వు బియ్యం బస్తాలు ఇవ్వాలి.! ఇదిగో.. మా సార్ కోసం మసాల ఐటమ్స్ కట్టేసి బ్యాగ్‌లో పెట్టు.! ఇదీ నగర శివారు ప్రాంతమైన పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుళ్ల దందా..

సీఐ పార్టీ ఇస్తున్నారని చెప్పి.. ఆ స్టేషన్ పరిధిలోని చికెన్ షాపుల నుంచి కిరాణా షాపుల వరకు ప్రతి ఒక్కరినీ దోచుకుతింటున్నారు ఖాకీలు. కొంత మంది కానిస్టేబుళ్లు ఉదయం నుంచే బ్యాగులు పట్టుకుని షాపుల మీద పడ్డారు. చికెన్ షాపుల వద్దకు వెళ్లి సీఐ ఇంట్లో ఫంక్షన్ ఉందని ఒకరు.. సీఐ పార్టీ ఇస్తున్నారని మరొకరు చెప్పి 2 కిలోల నుంచి 5 కిలోల వరకు డబ్బులు ఇవ్వకుండా పట్టుకుపోయారు. రోజు వారి వ్యాపారంపై జీవనం సాగించే ఇటువంటి చిన్న వ్యాపారుల నుంచి కిలోలకు కిలోలు చికెన్ కొట్టేయడంతో వారు బయటకు చెప్పుకోలేక మదనపడుతున్నారు. అలాగే రిటైల్ దుకాణాలకు వెళ్లి రైస్ బ్యాగులు, ఇతర వంట, మసాల సామాన్లు సైతం కట్టించుకుని డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారు.

ప్రతిసారీ అదే తంతు

ఈ స్టేషన్ సిబ్బంది వ్యవహారం పట్ల స్థానిక వ్యాపారులు విసుగెత్తిపోతున్నారు. ఖాకీ డ్రెస్ ఉందన్న కారణంతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సీఐ పేరు చెప్పి సాగిస్తున్న ఈ దందా నిజంగా ఇన్‌స్పెక్టర్ కోసమా? లేదా కానిస్టేబుళ్ల నిర్వాకమా? అన్నది తేలాల్సి ఉంది. ఉన్నతాధికారుల పేర్లు చెప్పి మార్కెట్ దందా చేయడంలో ఈ స్టేషన్ పరిధిలో సిబ్బంది సిద్ధహస్తులుగా పేరుపొందారు. చిరు వ్యాపారులు, దుకాణదారుల నుంచి ఉచితంగా సామాన్లు పట్టుకుపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరి వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలనుకున్నా.. ఆ తర్వాత మిగిలిన వారు తమపై కక్ష కట్టి ఇబ్బందులకు గురి చేస్తారన్న భయంతో వ్యాపారులు బహిరంగంగా చెప్పలేకపోతున్నారు.

సీఐ వ్యవహార శైలి అంతే..

ఈ స్టేషన్ సీఐ వ్యవహారం ఎప్పుడూ వివాదాస్పదంగానే ఉంటోంది. విందులు, వినోదాలపై అమితాసక్తి ఉన్న ఈ అధికారి పనిచేసిన చోటల్లా ఏదో వివాదంలో చిక్కుకుంటూ వస్తున్నాడు. కొన్ని సందర్భాల్లో ఉన్నతాధికారుల నుంచి మందలింపులతో పాటు ఓ మహిళ వివాదం విషయంలో సస్పెన్షన్‌కు సైతం గురయ్యాడు. అయినప్పటికీ అతని వ్యవహార శైలిలో ఎటువంటి మార్పు రాలేదని సహచర సిబ్బందే చెబుతుండడం గమనార్హం. ఓ అతిథి గృహంలో పార్టీ కోసమే కానిస్టేబుళ్లు మార్కెట్‌లో దందాకు దిగారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే నిజంగా సీఐయే కానిస్టేబుళ్లకు చెప్పి పంపించాడా? లేదా అన్నది తెలియాల్సి ఉంది. ఉన్నతాధికారులు ఇటువంటి సిబ్బందిపై దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.

నిర్వాసితులకు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నాం

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఈఈ బాపిరెడ్డి



పోచవరంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న ఈఈ బాపిరెడ్డి

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు కేటాయించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో తగిన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు జంగారెడ్డిగుడెం (రామన్నగుడెం) ఆర్‌అండ్ ఆర్ కాలనీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తాడిపత్రి బాపిరెడ్డి తెలిపారు. వీఆర్‌పురంలోని నిర్వాసిత గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. మండలంలోని పోలవరం ముంపు గ్రామాలైన కొల్లూరు, పోచవరం, కొండేపూడి, తుమ్మిలేరు, చొక్కనపల్లి కొండరెడ్డి గిరిజనులకు రామన్నగూడెం పునరావాస కాలనీలో పునరావాసం కల్పించామన్నారు. అక్కడకు త్వరలో వీరిని తరలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అందులో భాగంగా ముందస్తుగా ఈ గ్రామాల్లోని నిర్వాసితులను కలిసి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వాళ్ల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

సాక్షి,పాడేరు: జిల్లాలోని కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.ఆదివారం అరకు కేంద్ర కాఫీబోర్డు వద్ద 8.8 డిగ్రీలు,చింతపల్లి ఆర్ఏఆర్ఎస్, పాడేరు మండలం మినుములూరులో 10 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురుస్తోంది.సూర్యోదయం వేగంగా అయ్యింది. సాయంత్రం నుంచి చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. గిరిజనులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా

పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు

చింతపల్లి: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం పెంటపాడు నుంచి చింతపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేసిన బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ అంశాన్ని పక్కన పెట్టిందన్నారు. దేశాన్ని పూర్తిగా ప్రైవేటీకరించి దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని దుయ్యబట్టారు. జోడో యాత్ర స్ఫూర్తితో అన్ని జిల్లాల్లో యాత్రలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. ఎర్రవరంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి తాము పూర్తి వ్యతిరేకమన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు, నాయకులు శాంతకుమారి, కోనా ఎల్లారావు, మాజీ సర్పంచ్‌లు బాబులు, కృష్ణంపడాల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో స్మార్ట్ సేవలు

- గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఫోకస్
- పౌష్టికాహారం పంపిణీలో మరింత పారదర్శకత
- ప్రత్యేక యాప్‌లో సేవలన్నీ నిక్షిప్తం
- రాష్ట్రస్థాయి అధికారులు నేరుగా పర్యవేక్షణ



విశాఖనగరంలోని మధురానగర్ కేంద్రంలో చిన్నారులు



విశాఖనగరంలోని ధర్మానగర్‌లో గుర్తింపు కార్డులు చూపిస్తున్న గర్భిణులు, బాలింతలు

విశాఖ విద్య: మాతా-శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు విశేష సేవలందిస్తున్నాయి. ఈ కేంద్రాలు మరింత పారదర్శకమైన సేవలందించేలా ప్రభుత్వం తాజాగా చేసిన ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. విశాఖ జిల్లాలోని 776 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 20 మంది సూపర్ వైజర్లకు ఇటీవల స్మార్ట్‌ఫోన్లు అందజేసింది. కేంద్రాల్లో అందించే అన్ని రకాల సేవలను వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేసేలా వీటిని వినియోగిస్తున్నారు. సూపర్‌వైజర్లు మొదలుకొని, స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ స్థాయి అధికారుల వరకు యాప్ ద్వారా ప్రతి రోజూ కేంద్రాలను పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. చిన్నారులకు రుచికరమైన పౌష్టికాహారం అందించడంతో పాటు లబ్ధిదారులకు ప్రతి నెలా ఇంటికి ఇచ్చే రేషన్(టీహెచ్ఆర్) సరకుల్లో నాణ్యతకు పెద్ద పీట వేస్తూ.. త్వరలోనే మార్క్‌ఫెడ్ ద్వారా సరకులు సరఫరా చేయనున్నారు.

'సంపూర్ణ పోషణ'తో ఆరోగ్యమస్తు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీల నిర్వహణపై దృష్టి సారించింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసమని రుచికరమైన పౌష్టికాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరిట గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజూ మధ్యాహ్నం భోజనం, ఒక గుడ్డు, 200 మిల్లీ లీటర్ల పాలు ఇస్తున్నారు. అదే విధంగా టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్) కింద నెలకు పోషణ కిట్(కేజీ రాగిపిండి, కేజీ సజ్జ పిండి, కేజీ అటుకులు, 250 గ్రామల బెల్లం, 250 గ్రామలు ఎండి ఖర్జూరం, చెక్కీలు) అందజేస్తున్నారు.

ప్రీ స్కూల్ పిల్లలకు 2.5 కిలోల బాలామృతం ప్యాకెట్, 25 గుడ్లు, 2.5 లీటర్ల పాలు ఇస్తున్నారు. సచివాలయ ఏఎన్ఎంలు రెగ్యులర్‌గా కేంద్రాలను సందర్శించి ఆరోగ్యపరమైన సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు.

అందరికీ పౌష్టికాహారం అందేలా..

విశాఖ పట్నం జిల్లాలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కలిపి 84,032 మంది లబ్ధిదారులు నమోదుకాగా, ఇందులో 77,156 మంది సేవలు పొందుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో 91.80 శాతం మంది కేంద్రాల్లో సేవలు అందుకుంటున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో నూరుశాతం లక్ష్యం సాధించేలా అధికారులు ఫోకస్ పెట్టారు.

సంక్షిప్త సమాచారం

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	04
జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	776
సేవలందుకుంటున్న గర్భిణులు	7,779
బాలింతలు	7,621
6 నెలల నుంచి 3 ఏళ్ల వరకు పిల్లలు	50,796
3–6 సంవత్సరాల పిల్లలు	10,960
అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు	221

స్మార్ట్‌ఫోన్లతో సకాలంలో సమాచారం



కేంద్రాల కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు స్మార్టుఫోన్లు అందించాం. కేంద్రాల్లో నమోదైన వారందరికీ పౌష్టికాహారం అందించాలని కార్యకర్తలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. నూరుశాతం లక్ష్యం సాధించేందుకు కృషి చేస్తున్నాం. కేంద్రాలను తరచూ తనిఖీ చేస్తున్నాం. మార్క్‌ఫెడ్ ద్వారా సరకుల సరఫరాపై ఏర్పాట్లు జరుగుతున్నాయి.

–డి.వెంకటేశ్వరి, ప్రాజెక్టు అధికారి, విశాఖ జిల్లా

గతంలో కంటే సేవలు పెరిగాయి



కేంద్రాల్లో గతంలో కన్నా సేవలు బాగా పెరిగాయి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా ఏ రోజుకారోజు వివరాలను నమోదు చేస్తున్నాం. గర్భిణులు, బాలింతలకు ఇచ్చే సరకులు కూడా సకాలంలోనే కేంద్రాలకు వస్తున్నాయి. ఆట వస్తువులు ఇటీవలే వచ్చాయి. ఇవి ప్రీ స్కూల్ పిల్లలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

–కె.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, ఇందిరానగర్

క్లుప్తంగా

వైభవంగా ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ట


ఆంజనేయస్వామి విగ్రహం

రాజవొమ్మంగి: దూసరపాము లక్ష్మీగణపతి ఆలయ సమీపాన ఆదివారం ఆంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. కండిపల్లి వెంకటరమణ దంపతులు పూజలు చేశారు. ఫణీంద్ర దంపతులు హోమాలు నిర్వహించారు. కనిగిరి లక్ష్మి, రమణి, చంటి, సత్యనారాయణమ్మ, రాధాకృష్ణ, మురళిల, వాసుదేవరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. బీసీ కాలనీకు చెంది భక్తులు హాజరయ్యారు.

యూటీఎఫ్ సంకల్ప దీక్ష

చింతూరు: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం చింతూరులో సంకల్ప దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పండా కిష్టయ్య మాట్లాడుతూ హామీ ఇచ్చిన మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కవిత, సీతారామయ్య, జగదీష్, రామకృష్ణ, కన్నారావు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తం


యువకులతో మాట్లాడుతున్న సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ

సీలేరు: అనుమానాస్పద వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని కోరుతూ ఆదివారం దారకొండ వారపు సంతలో సీలేరు ఎస్‌ఐ జె.రామకృష్ణ ప్రచారం నిర్వహించారు. సంతలో తనిఖీలు నిర్వహించిన ఆయన యువతతో మమేకమయ్యారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దన్నారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దన్నారు.


పెదగార్లపాడులో వైద్య శిబిరం

గంగవరం: సీపీఐ ఎంఎల్ లిబరేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం పెదగార్లపాడులో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు చిన్నిబిల్లి సత్యనారాయణ, కె.విష్ణుమూర్తి 156 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందచేశారు. గిరిజనులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. దుప్పట్లు, మాస్కులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కాకినాడ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, జన సంస్కృతి మండలి జిల్లా అధ్యక్షుడు సామిశెట్టి ప్రసాదరావు, పల్లా శ్రీను, శ్యాములు, రాజు ప్రదీప్ పాల్గొన్నారు.

నేడు వారపు సంత

అనంతగిరి: స్థానిక వైఎస్సార్ సంతబయలు వద్ద సోమవారం వారపు సంత నిర్వహించనున్నారు. గిరిజనులు అటవీ ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయిస్తారు. లక్ష్మీపురం, తెనెపుట్టు, తలారీపాడు, పాతకోట గ్రామాలు నుంచి తేనె, అల్లం, పసుపు, తదితర అటవీ ఉత్పత్తులు అధిక సంఖ్యలో వస్తుంటాయి.

నల్లకొండమ్మ తల్లి గిరిప్రదక్షిణ


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నాతవరం: మండలంలో తాండవ రిజర్వాయర్ గట్టు దిగువన నల్లకొండమ్మ తల్లి ఆలయం చుట్టూ ఆదివారం భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. ఏటా ఫిబ్రవరిలో వచ్చే గురుపౌర్ణమి రోజున అమ్మవారికి గిరి ప్రదక్షిణ చేస్తామని ఆలయ ధర్మకర్త కూనిశెట్టి జోగిరాజు తెలిపారు. ఏడు కిలోమీటర్ల దూరం భక్తులు ఉదయం నుంచి ప్రదక్షిణ చేశారన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో వినాయకుడు, ఆంజనేయస్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులు గిరి ప్రదక్షిణ చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి పూజలు


జి.మాడుగుల: హోమంలో పాల్గొన్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మత్స్యరాజు దంపతులు


రాజవొమ్మంగి: వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


అడ్డతీగల: పూజలందుకున్న మానసాదేవి అమ్మవారు

రాజవొమ్మంగి: పవిత్రమైన మాఘపౌర్ణమి రోజున రాజవొమ్మంగిలో భక్తులు విష్ణువు, లక్ష్మీదేవిలకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం భక్తులు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంకాలం సామూహిక హారతులు ఇచ్చారు. మాఘ పౌర్ణమి శుభ యోగంలోనే శ్రీరాముడు జన్మించినట్లు హిందువుల ప్రగాఢ విశ్వాసం. ఈ రోజున ఏ కార్యక్రమం చేపట్టినా శుభ ఫలితాలు పొందుతారని నమ్మిన వారు అనేక నూతన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సారి మాఘ పౌర్ణమి ఆదివారం రోజున రావడంతో ఆదిత్యునికి ఎర్రని పూలతో పూజలు చేసి ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందారు. పౌర్ణమి సందర్భంగా పలు ఆలయాల్లో నవగ్రహాలకు పూజలు జరిగాయి

మానసాదేవికి ప్రత్యేక పూజలు

అడ్డతీగల: మాఘపౌర్ణమి పురస్కరించుకుని పవనగిరి క్షేత్రంలో మానసాదేవి అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి ఎర్రని వస్త్రాలను అమర్చి చందనం పూసి తెల్లజిల్లేడు పూలతో అష్టోత్తర శతనామావళి పఠించారు. అనంతరం అమ్మవారికి కవచమంత్రాలతో కుంకుమార్చన తదితర పూజలు చేశారు. కృష్ణుడికి అత్యంత ప్రీతికరమైన మాఘపౌర్ణమి నాడు ఆ స్వామివారికి ఇష్టమైన శిష్యురాలైన నాగాధిపతి మానసాదేవి అమ్మవారిని ఆరాధించడం వల్ల వంశపారంపర్యంగా సర్పదోషాలు తొలగిపోతాయని వెంకటరామయ్య తెలిపారు. ఐదు లక్షల దఫాలు మానసాదేవి అమ్మవారి మూలమంత్రాన్ని జపిస్తే అట్టివారికి మంత్రసిద్ధి లభించి అటువంటి సాధకులకు సర్పాలు దాసోహం అవుతాయన్నారు.

పాకలపాటి గురుదేవుల ఆలయంలో పౌర్ణమి వేడుకలు

జి.మాడుగుల: స్థానిక పాకలపాటి గురుదేవుల ఆలయంలో మాఘ పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పాకలపాటి గురుదేవుల ఆలయ సన్నిధిలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మత్స్యరాస మత్స్యరాజు, పాడేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి వేదమంత్రోచ్ఛరణలతో హోమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం పెద బంగార్రాజు, అడపా బాబూరావు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

- కొయ్యూరు సీఐ స్వామినాయుడు


అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కొయ్యూరు: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ స్వామినాయుడు కోరారు. ఆన్‌లైన్‌లో డబ్బులు కాజేసేందుకు వీలుగా ఆధార్ నంబర్లు లేదా పాన్‌కార్డు వివరాల కోసం సందేశాలు పంపిస్తారన్నారు. వాటిని నమ్మి పంపిస్తే మొత్తం ఖాతాలో నగదు మాయం అవుతుందని హెచ్చరించారు. ఆయన ఆదివారం కొయ్యూరు సంతలో గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ మోసాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. వాటిని గుర్తించి జాగ్రత్తగా ఉండాలన్నారు. కొందరు పొరపాటున మీ ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుందని చెప్పాలని కోరినా చెప్పొద్దని సూచించారు. అలా చెబితే నగదు ఖాళీ చేస్తారన్నారు. గిరిజనులు సారాకు దూరంగా ఉండాలన్నారు. సారా తయారీ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను బాగా చదివిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయన్నారు. అనంతరం పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలపై అవగాహన కల్పించారు. కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్, కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు


రోగులకు సేవలు అందిస్తున్న వైద్యుడు

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిష్ఠలానందజీ మహారాజ్ తెలిపారు. ఈ శిబిరంలో రెండు వందల మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వీరిలో అవసరమైన వారికి రక్తపరీక్షలు 74 మందికి, థైరాయిడ్ పరీక్షలు ఎనిమిది మందికి, ఫిజియోథెరపీ ఎనిమిది మందికి, ఎక్స్-రేలు ఎనిమిది మందికి, ఈసీజీ ఒక్కరికి చేసినట్లు పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు, వారి సహాయకులకు ఆహార పొట్లాలు అందించారు. చీటతలారి వెంకట సుబ్బారావు, చీట భాస్కర్, చీట రాయుడు శ్రీనివాస్, చీట సంపత్ కుమార్, రామకృష్ణ మిషన్ రాజమండ్రి కమిటీ సభ్యుడు ఎస్.దుర్గాప్రసాద్, రామకృష్ణ మిషన్ సేవా సమితి అనపర్తి సభ్యులు రామిరెడ్డి, శ్వేతా, రామకృష్ణ మిషన్ క్యాంప్ కో - ఆర్డినేటర్ కానుమొను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ విగ్రహ ప్రతిష్టాపన


పూజలు చేస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి


కృష్ణాపురంలో రామానంద స్వామిజీకి జ్ఞాపిక అందిస్తున్న సాయిరాంస్వామిజీ

జి.మాడుగుల/చింతపల్లి: చింతపల్లి మండలం కృష్ణాపురంలో వైకుంఠ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామానందస్వామి, పాకలపాటి గురుదేవుల భక్తుల సంఘం అధ్యక్షుడు మత్స్యరాస మత్స్యరాజు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొడుగుమామిడిలో సీతారాములు విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టరు టి. నర్సింగరావు, మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు, గిరిజన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్య కొండంనాయుడు, రాష్ట్ర గిరిజన మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి కురుసా రాజారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లకే బాలయ్యదొర, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యుడు కె. చిన్నయ్య, మండల సచివాలయాల కన్వీనర్ కల్యాణ్ పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: తుమిసెల గ్రామ సమీపంలోని కొండవాగుపై వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షలతో నిర్మిస్తున్న ఈ వంతెనకు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి భూమిపూజ చేశారు. పార్టీ జిల్లా నాయకుడు గుడ్ల త్రిమూర్తులు, మండల కన్వీనర్ ఎం అప్పారావు, మండల నాయకులు ఎం భారతిబాబు, మడి బాబి, కరణం కనకరాజు, బలిరెడ్డి నూకరాజు, పల్లాల అబ్బాయిరెడ్డి, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు తాజంగి పంచాయతీలో గడప గడపకు

చింతపల్లి రూరల్: తాజంగి పంచాయతీలోని పలు గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు రావాలన్నారు. చీమలబయిలు, తాళ్లకోట, రాజేంద్రపురం, బలబద్రం, సప్పిడిమెట్ట, బాసింగికొత్తూరు, గెత్తంపాకలు గ్రామాల్లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

వంచంగిలో..

రాజవొమ్మంగి: వంచంగి, బలిజపాడు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, సచివాలయ స్టాఫ్, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సుజనపేటలో ..

ముంచంగిపుట్టు: సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ తెలిపారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ముంచంగిపుట్టులో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశానికి పార్టీ పరిశీలకుడు కిశోర్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు.

శరవేగంగా అదనపు తరగతి భవనం పనులు


శ్లాబ్ పనులకు పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది


పూర్తయిన శ్లాబ్ పనులు

అనంతగిరి: పెద్దూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నాడు-నేడు రెండో విడతలో మంజూరైన రూ.24 లక్షలతో అదనపు తరగతి భవనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ శ్లాబ్ పనులను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంధ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్ ఆదివారం పర్యవేక్షించారు. నాడు - నేడుతో విద్యా వ్యవస్థలోని అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సందడి

మాడుగుల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఆదివారం ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల టేకు తోటలో కలుసుకున్నారు. యడ్ల హేమంత్‌కుమార్, కుక్కర శ్రీధర్, పుట్టా శేషు, భమిడిపాటి గిరి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాటి గురువులు రామ్మోహన్‌రావు, బాబి మాస్టార్లను సన్మానించారు.

గిరిజనుల సమస్యలు తీర్చేందుకు ప్రత్యేక కృషి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వినయ్


గిరిజనులతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వినయ్


కాలినడకన పర్యటిస్తున్న వినయ్

హుకుంపేట: మారుమూల గిరిజన గ్రామాలభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తనయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వినయ్ అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కొండలు, గుట్టలు దాటుకుంటూ 14 కిలోమీటర్ల మేర కాలినడక నడిచి మండలంలోని మారుమూల జర్రకొండ పంచాయతీ గనిక గ్రామానికి చేరుకున్నారు. అక్కడ గిరిజనుల కష్టనష్టాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పించినందుకు గిరిజనులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రోడ్డు సమస్య తీర్చాలని విన్నవించగా ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కనీసం కాలినడక నడవడానికి మార్గం సరిగ్గా లేనప్పటికి జగనన్న పాలనలో ఎమ్మెల్యే పాల్గుణ చొరవ తీసుకుని రోడ్డు మంజూరు చేసి పనులు ప్రారంభించారన్నారు. కొద్ది రోజుల్లో గనిక గ్రామంలో ఎమ్మెల్యేతో ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్డు పనులు పూర్తయ్యేందుకు కృషి చేస్తామన్నారు. జర్రకొండ, గేదెలపాడు గ్రామాలకు రూ.5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కొద్ది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. శివారు గ్రామాలభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ సుబ్బారావు, నాయకులు కె.కోటిబాబు, వలంటీర్ల యూనియన్ మండల అధ్యక్షుడు కొండబాబు, కార్యదర్శి అంబేడ్కర్ పాల్గొన్నారు.

సరికొత్త కాన్సెప్ట్‌తో పాప్‌కార్న్


వివరాలు వెల్లడిస్తున్న పాప్‌కార్న్ సినిమా యూనిట్

డాబాగార్డెన్స్ : ఆచార్య క్రియేషన్స్ బ్యానర్‌పై సాయి, అవికాగొర్ హీరో, హీరోయిన్లుగా భోగేంద్ర గుప్తా నిర్మాణంలో మురళీ గంధం దర్శకత్వం వహించిన పాప్‌కార్న్ మూవీ ఈ నెల 10న విడుదల కానుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ విశాఖలో మీడియాతో మాట్లాడుతూ సినిమాకి సంబంధించిన విశేషాలు తెలియజేసింది. దర్శకుడు మురళీగంధం మాట్లాడుతూ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా ఆడియన్స్‌కి ఓ కొత్త అనుభూతిని ఇస్తుందని తెలిపారు. సినిమా చాలా వరకు లిఫ్టులో కొనసాగుతుందన్నారు. హీరో, హీరోయిన్లు 18 గంటల పాటు ఒక లిఫ్ట్‌లో ఇరుక్కుపోతారని, ఈ క్రమంలో వారిద్దరి మధ్య జరిగిన సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని వెల్లడించారు. ఈ మూవీ అందరినీ అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో సాయి మాట్లాడుతూ ప్రెజర్‌కుక్కర్, రాజహంస వంటి పలు చిత్రాల్లో హీరోగా చేశానని తెలిపారు. పాప్‌కార్న్ మూవీ తనకు చాలా పేరు తీసుకొస్తుందని చెప్పారు. హీరోయిన్ అవికాగొర్‌తో తన కెమిస్ట్రీ చాలా బాగుంటుందని పేర్కొన్నారు. కుటుంబమంతా కలిసి చూసే విధంగా ఈ సినిమా ఉంటుందన్నారు. హీరోయిన్ అవికాగొర్ మాట్లాడుతూ తన కెరీర్‌లోనే పాప్‌కార్న్ మూవీ ఒక ప్రత్యేకమైనదని చెప్పారు. దర్శకుడు అద్భుతంగా ఈ మూవీని తెరకెక్కించారని వివరించారు. భోగేంద్ర గుప్తా మాట్లాడుతూ తెలుగులో సరికొత్త కాన్సెప్ట్‌తో పాప్‌కార్న్ మూవీని తీయడం జరిగిందన్నారు. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారని చెప్పారు. ఇది వరకు తమ బ్యానర్ నెపోలియన్, పొలిమేర వంటి వినూత్న చిత్రాలను తీసామన్నారు.

సాగరతీరంలో సందడి : బీచ్‌రోడ్డు: పాప్‌కార్న్ చిత్ర యూనిట్ ఆదివారం సాగరతీరంలో సందడి చేసింది. వైఎంసీఏ వద్ద ఉన్న ఓసియన్ ఎడ్జ్‌ను సందర్శించి అక్కడ ఆహార ప్రియులతో హీరోహీరోయిన్లు సాయి, అవికాగొర్ ముచ్చటించారు.

చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా... శ్లాబ్ కూలి వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్ : స్థానిక నాయుళ్లవీధికి చెందిన పట్నాల శ్రీను(48) శ్లాబ్ కూలి ఆదివారం మృతి చెందాడు. పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీను వడ్రంగి పని చేసుకుంటూ భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మీదేవిపేటకు చెందిన ఎం.సత్యారావు తన గృహంలో విద్యుత్‌వైర్లకు చెట్టుకొమ్మలు తగులుతూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని తెలపడంతో చెట్ల కొమ్మలు తొలగించడానికి ఆదివారం ఉదయం అతని ఇంటికి శ్రీను వెళ్లాడు. శిథిలావస్థకు చేరుకున్న శ్లాబ్‌పైకి ఎక్కి చెట్టుకొమ్మలు తొలగిస్తుండగా ఒక్కసారిగా శ్లాబ్ కూలిపోవడంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

నాకు దిక్కెవరంటూ విలపించిన భార్య, పిల్లలు

భర్త విగతజీవిగా మారడంతో ఇద్దరు చిన్నారులతో తానెలా జీవించేదంటూ ఆమె గుండెలవిసేలా రోధించింది. భర్త మృతితో సర్వం కోల్పోయిన లక్ష్మి రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన గళం

రాజవొమ్మంగి: ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ఆదివారం వివిధ ప్రజా సంఘాల పార్టీ నాయకులు తమ నిరసన గళం వినిపించారు. బడ్జెట్ ప్రతులను తగుల పెట్టారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన 2023-24 బడ్జెట్ దేశప్రజలపై పెనుభారం మోపిందని సీపీఎం రంపచోడవరం కార్యవర్గ సభ్యుడు లోతా రామారావు విమర్శించారు. కార్మిక వర్గానికి అన్యాయం చేస్తూ బడ్జెట్‌లో కనీస వేతనాల గురించి ప్రస్తావించలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, పెరుగుదలపై చర్యలు లేవన్నారు. ఏజెన్సీ అభివృద్ధికి కేంద్రం నిధులు వెచ్చించలేదని విమర్శించారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరానికి నిధుల కేటాయింపు తదితర అంశాల ఊసేలేదన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరం అన్నారు. బడ్జెట్‌ను పునర్‌వ్యవస్థీకరించాలని డిమాండ్ చేశారు. కోండ్ల సూరిబాబు, లోవరాజు, అర్జున్, అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

8న మెగా వైద్య శిబిరం

రాజవొమ్మంగి: రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈనెల 8న ఉదయం 9 గంటల నుంచి మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాపన్నదొర ఆదివారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. రక్తదానం చేసేవారు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలన్నారు. రక్తదాతలకు రెడ్‌క్రాస్ సంస్థ సర్టిఫికెట్లను అందజేస్తుందన్నారు.

సీఆర్పీఎఫ్ పోలీసుల సాయం

వై.రామవరం: పి. యర్రగొండ గ్రామ సచివాలయం పరిధిలోని కోకితగొంది గ్రామ వలంటీరు ఆర్‌వీవీ సత్యనారాయణరెడ్డి కుటుంబానికి ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు నిత్యావసర వస్తువులు, దుస్తులు, రగ్గులు, నగదు అందజేశారు. ఇటీవల గ్రామ వలంటీరు పూరిల్లు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన విషయం విదితమే. బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎంఎల్ నాయుడు ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఎస్సై ఎం సంతోష్‌కుమార్ సాయం చేశారు.


బాధిత కుటుంబానికి సహాయం అందిస్తున్న సీఆర్పీఎఫ్ పోలీసులు